క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి రూరల్: అద్దంకి నార్త్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అద్దంకి పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అద్దంకి పట్టణ అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

29న అద్దంకిలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

అద్దంకి రూరల్: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అసిస్ట్, నిపుణ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 29న అద్దంకిలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించే పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈమేళాలో 1000 మందికి పైగా ఉద్యోగ కల్పనతో 25 కంపెనీలు పాల్గొననున్నాయని తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న యువకులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ సెక్రటరీ జాషికృష్ణ, నిపుణ అసిసోషియేట్ డైరక్టర్, అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీఓ శింగయ్య పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్ర నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

అద్దంకి రూరల్: ప్రముఖపుణ్య క్షేత్రం శింగరకొండలోని ప్రసన్నాంజనేయ విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం శింగరకొండలోని అన్నదాన సత్రంలో చెన్నుపల్లి కోటిలింగాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యుల అభిప్రాయాల మేరకు అధ్యక్షుడుగా పొన్నపల్లి బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి చింతలపూడి వీరయ్యాచారి, కోశాధికారిగా దేవరకొండ నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గోళ్లపాటి వెంకటాచారి, చేబ్రోలు రవీంద్రచారి, ఆళ్లగడ్డ వీర సుందరాచారి, తక్కెళ్లపాటి నాగేశ్వరరావు, ముప్పవరం బ్రహ్మం, కొండముది రమేష్, ముత్తులేరి హరిబాబు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఆశ్వీయూజ మాసం, భరణి నక్షత్రం, విదియ తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుఆయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

హోమియో.. ఏమీ లేదయ్యో !

- ఉప్పుటూరులో మూలనపడిన ప్రభుత్వ హోమియో ఆసుపత్రి
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వైద్యశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణం
- ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకురావాలని ప్రజల డిమాండ్

పర్చూరు (చినగంజాం):

కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు దాటినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. కీలకమైన వ్యవసాయం, విద్య, వైద్యం రంగాలను గాలికొదిలేసింది. గత ప్రభుత్వంలో నాణ్యమైన విద్య, వైద్యం అందితే.. ఈకూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం యథేచ్ఛగా దొరుకుతోంది. దీంతో ప్రజలు ఎందుకు ఓటేశామా అని బాధపడుతున్నారు. ఒకప్పుడు గొప్పగా వెలుగొందిన ప్రభుత్వ హోమియో ఆసుపత్రి నేడు వైద్యశాఖాధికారుల నిర్లక్ష్యంతో మూలనపడింది. ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన హోమియో ఆసుపత్రి గత చరిత్రకు ఆనవాలుగా మారిపోయింది. పర్చూరు మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో పేరుగాంచిన ప్రభుత్వ హోమియో ఆసుపత్రి శిథిలావస్థకు చేరింది. గడచిన నాలుగేళ్లుగా ఆసుపత్రిలో సిబ్బంది లేక ఆసుపత్రి మూతపడిపోయింది. ఆసుపత్రి మూతపడి నాలుగేళ్లు దాటినా దానిగురించి పట్టించుకున్న నాథుడే లేడు. గతంలో ఆసుపత్రిలో పనిచేసిన సిబ్బంది ఉద్యోగ విరమణ చేయడంతో ఇప్పటి వరకు ప్రభుత్వం వీరి స్థానంలో కొత్త వారిని ఎవరినీ నియమించలేదు.

ఆసుపత్రి ప్రాంగణంలోకి వెళ్లాలంటే కష్టమే..

ఆసుపత్రి గత కొంతకాలంగా మూతపడటంతో ప్రాంగణమంతా పిచ్చిచెట్లు మొలిచి భయంకరంగా తయారైంది. ఆసుపత్రిలోకి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. ఆసుపత్రిలో ఉన్న మందులు, ఫర్నీచర్, ఇతర సామగ్రి పూర్తిగా పాడైపోయే పరిస్థితి తలెత్తింది. ఆసుపత్రి ప్రాంగణం ఉపయోగంలో లేక పోవడంతో ఆసుపత్రి ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. ఆసుపత్రి ప్రాంగణంలో విషసర్పాలు, ఇతర ప్రమాదకరమైన జీవులు సంచరిస్తుండటంతో లోపలికి వెళ్లాలంటే కష్టంగా మారింది.



ఉప్పుటూరు గ్రామంలో శిథిలావస్థకు చేరిన హోమియో ఆసుపత్రి

చుట్టుపక్కల గ్రామాల్లో పేరుగాంచిన ఆసుపత్రి..

గతంలో ఆసుపత్రిలో సిబ్బంది పనిచేస్తున్న సమయంలో ఉప్పుటూరు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది రోగులు వైద్యం కోసం వచ్చేవారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులు మధ్యాహ్నం భోజనం సైతం వెంట తెచ్చుకొని డాక్టర్ కోసం వేచి ఉండి వైద్యం చేయించుకొని ఉచితంగా మందులు తీసుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లేవారు. అటువంటి ఆసుపత్రి సిబ్బంది లేక ఉపయోగంలో లేక నిరుపయోగంగా మారింది. ఆసుపత్రి భవనం, అందులోని ఫర్నీచర్ శిథిలావస్థకు చేరుతుంది. ఆసుపత్రిని బాగు చేయించి నూతనంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకు రావాలని మండల, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

హోమియో కోసం దూరప్రాంతాలకు వెళ్తున్నారు..



హోమియో ఆసుపత్రి మూలన పడటంతో గ్రామంలోని ప్రజలు, చుట్టు గ్రామాల వారు హోమియో వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్తున్నారు. హోమియో చికిత్స, మందుల కోసం దూరం వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని హోమియో ఆసుపత్రి మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు అనువుగా ఉండేది. ఆసుపత్రికి సిబ్బందిని నియమించి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలి.

– మూలంరాజు కుమారస్వామి, ఉప్పుటూరు.

అధికారుల నిర్లక్ష్యంతో మూత పడింది..



ఉప్పుటూరు గ్రామంలోని హోమియో ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యంతో మూత పడింది. ఆసుపత్రి వైద్యులు రిటైర్డ్ అయిన తరువాత కొత్తగా వైద్యుడిని ఏర్పాటు చేయడంతో అధికారులు పట్టించుకోలేదు. గతంలో దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసుకునేందుకు ప్రజలు ఇక్కడికి వచ్చేవారు. సిబ్బందిని నియమించక పోవడంతో ఆసుపత్రి మూతపడింది.

–షేక్ సుభాని, ఉప్పుటూరు

మునగాకుతో రక్తహీనత దూరం



వాడరేవులో మునగాకు ప్రయోజనాలు వివరిస్తున్న సూపర్‌వైజర్ సునంద



పంగులూరులో మునగాకు మహోత్సవం జరుపుతున్న అంగన్వాడీలు

చీరాల టౌన్: మునగాకును ఆహారంలో తీసుకోవడం వలన శరీరానికి సూక్ష్మ పోషకాలు లభిస్తాయని.. గర్భిణులు, బాలింతలు విధిగా తీసుకోవడంతో వివిధ రకాల రుగ్మతలు తొలగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సునంద తెలిపారు. శుక్రవారం మండలంలోని వాడరేవు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు పాలు ఇచ్చే తల్లులు విధిగా వారానికి రెండుసార్లు మునగాకు ఆహారంలో తీసుకోవడంతో శరీరానికి సూక్ష్మ పోషకాలు అందుతాయన్నారు. మునగ ఆకు వలన ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఏ పుష్కలంగా లభిస్తుందని ఫలితంగా రక్తహీనత రాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఝాన్సీరాణి, లక్ష్మీసుజాత, ఉషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరల్లో మంచి పోషకాలు

కారంచేడు: రక్తహీనతతో ఇబ్బందులు పడేవారు, గర్భిణు, చిన్న పిల్లలు, వృద్ధులు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని ఐసీడీఎస్ కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్ సుమలత అన్నారు. కారంచేడు గ్రామంలో ఏర్పాటు చేసిన పోషకాహార అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆకుకూరల్లో ఎక్కువగా మునగాకు మరింత మేలు చేస్తుందన్నారు.

మునగాకుతో ఉపయోగాలు ఎన్నో..

జే.పంగులూరు: మన ఇళ్ల దగ్గర దొరికే మునగాకుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఐసీడీఎస్ పంగులూరు సెక్టార్ సూపర్వైజర్ జయప్రద అన్నారు. మునగాకు మహోత్సవాన్ని శుక్రవారం పంగులూరులోని అంగన్వాడీ కేంద్రంలో జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునగాకు తింటే 300 రకాల రోగాలు దూరంగా ఉంటాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు డీ స్వర్ణలత, సీహెచ్ సుకన్య, సరోజీనీ, అన్నమ్మ, ఫీరాంబి పాల్గొన్నారు.



కారంచేడులో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సుమలత

వాగ్దానాలు అమలు చేయని చంద్రబాబు

చీరాల రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు పునరుద్ధరించి బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే విడుదల చేయాలని దళిత మహాసభ నాయకుడు నీలం నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దళిత మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇంతవరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఒక్క హామీ కూడా అమలుచేయలేదన్నారు. గత ప్రభుత్వంలోని పింఛన్లు తప్ప కొత్తగా ఒక్కటి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. అలానే ఎన్నికలలో ఇచ్చిన హామీ 50 ఏళ్లకే ఫించన్లు ఇస్తానని చెప్పిన ఆయన ఇంతవరకు ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. 2023తో ముగిసిన ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ ఆర్డినెన్స్‌ను తెచ్చారే కానీ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టలేదన్నారు. మనువాద బీజేపీకి గొడుగు పడుతున్న చంద్రబాబు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు పేరిట రెండు శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఉవ్విళ్లూరుతున్న చంద్రబాబు ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంలేదని విమర్శించారు. చేగువేరా, కారల్ మార్క్స్, అంబేడ్కర్ వంటి మేధావులు నాకు ఆదర్శం అని చెప్పిన పవన్ కళ్యాణ్ జనసేనను బీజేపి భజన సేనగా మార్చివేసి తాను సనాతన స్టార్‌గా మారిపోయాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో బహుజన గిరిజన వేదిక అధ్యక్షుడు గంటా సుబ్బారావు, మేరిగ రమేష్ బాబు, మాల మహానాడు నాయకుడు కసుకుర్తి రాజు, కోటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత నాయకుడు నాగేంద్రరావు

భూ వివాదాలపై గ్రామసభలు

పర్చూరు (చినగంజాం): భూ వివాదాల సమస్యలపై కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల భూములు రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తామని ఇందులో భాగంగా దేవరపల్లి, గొల్లపూడి, అడుసుమల్లి, గర్నెపూడి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు భూవివాదాల సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలన్నారు. ఈ నెల 22వ తేదీ దేవరపల్లి, 23 వతేదీ అడుసుమల్లి, 24వ తేదీ గర్నెపూడి, 25వ తేదీ గొల్లపూడి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

సాహిత్యంలో రావూరి సేవలు మరువలేనివి



రావూరి భరద్వాజ వర్ధంతి నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘు నాయకులు

మార్టూరు: తెలుగు సాహిత్యంలో రావూరి భరద్వాజ సేవలు మరువలేనివని రచయితలు పేర్కొన్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ వర్ధంతి వేడుకలు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రం మార్టూరు అమ్మ అనాథశ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాకుడురాళ్ల నవలకుగాను భారత ప్రభుత్వం జ్ఞానపీఠ్ అవార్డు వచ్చిందన్నారు. భరద్వాజ నేటి తరాలకు ఆదర్శమని వారు కొనియాడారు. అనంతరం భరద్వాజ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన వితరణ చేశారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

బల్లికురవ: బాలికలు జీవితంలో స్థిరపడేవరకు వివాహాలు చేసుకోవద్దని జిల్లా పిల్లల సంరక్షణ అధికారిణి శ్రీప్రియ అన్నారు. శుక్రవారం బల్లికురవలో బాల్యవివాహాల నిర్మూలనపై బాలికలతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహ వయసు రాకుండా బాల్యవాహాలు చేసుకోవటంవల్ల అనారోగ్యంతో పాటు చదువుకు దూరమవుతారన్నారు. అనంతరం బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను విద్యార్థినులకు వివరించారు. బాల్యవాహాల నిర్మూలనకు గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటుతో విద్యావంతులంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ అధికారి పీ. మౌనిక, ఎంఈఓ-2 కే రమేష్‌బాబు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్. విజయనిర్మల తదితరులు పాల్గొని మాట్లాడారు.



బాల్యవివాహాల నిర్మూలనపై మాట్లాడుతున్న శ్రీప్రియ

సామాజిక సేవల్లో రోటరీ ముందంజ

వేటపాలెం: రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కే శరత్ చౌదరి అన్నారు. వేటపాలెం రోటరీ క్లబ్‌ను రోటరీ జిల్లా గవర్నర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోటరీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్ క్లబ్ ద్వారా చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలు వివరించారు. అనంతరం రోటరీ గవర్నర్ మాట్లాడుతూ క్లబ్ ద్వారా నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాలు మంచి పేరు తెస్తాయన్నారు. క్లబ్ ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ టి రమేష్ చంద్ర, క్లబ్ సెక్రటరీ వీ లక్ష్మణస్వామి, క్లబ్ వ్యవస్థాపకుడు గొల్లపూడి సీతారాం, మాజీ అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరావు, బట్టా మోహన్‌రావు, పాగడ దండ రవికుమార్, ప్రత్తి వెంకట సుబ్బారావు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోటరీ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మేదరమెట్ల: ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో మెలగాలని మేదరమెట్ల ప్రభుత్వ వేద్యశాల డాక్టర్ చిట్టిబాబు సూచించారు. కొరిరిశపాడు మండలంలోని మేదరమెట్లలో గల మూడు సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులు రాకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు పడుతున్న సమయంలో ఇంటి పరిసరాల్లో మురుగునీటి కుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నుంచి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, కాచి చల్లార్చిన నీటినే తాగడం ఎంతో మంచిదని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో బ్రహ్మానందం, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ చిట్టిబాబు

పెళ్లి బాజాలకు వేళాయే..

చీరాల అర్బన్: శ్రీరస్తు శుభమస్తు కళ్యాణమస్తు అనేందుకు సమయం రానేవచ్చింది. పల్లెలు, పట్టణాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. సన్నాయి మేళాల సవ్వడి వినిపించే సమయం ఆసన్నమైంది. ఈనెల 13 నుంచి శుభముహూర్తాలు ప్రారంభమయ్యాయి. నెల రోజులు తర్వాత కల్యాణ మండపాలు కళకళలాడుతున్నాయి. వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉండడంతో ఇళ్ల వద్ద కాకుండా మండపాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత ముహూర్తాలలో వివాహాలతో పాటు గృహప్రవేశాలు, భూమి పూజలు, ఉపనయనాలు, బారసాలలు వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. చీరాల నియోజకవర్గంలో చిన్న, పెద్దవి కలిపి 30కి పైగా కళ్యాణ మండపాలు ఉన్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్న ఏసీ కల్యాణ మండపాల అద్దెలు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉన్నాయి. అలంకరణ, విద్యుత్ చార్జీలు, ఇతర ఖర్చులకు అదనంగా భరించాల్సిందే. శుభముహూర్తాలు ఉండడంతో మంగళవాయిద్యాలు, ట్రావెల్స్, ఫ్లవర్ డెకరేషన్, షామియానాలు, ఫొటోగ్రాఫర్లు, వంట మాస్టర్లుకు, ఆర్కెస్ట్రా, పురోహితులకు చేతి నిండా పనిదొరుకుతుంది. ఈ నెలతో పాటు నవంబర్, డిసెంబర్ నెలలో శుభ ముహూర్తాలు ఉండడంతో అన్ని శుభకార్యాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

శుభకార్యాలకు శుభారంభం...

ఈనెలతో పాటు నవంబర్, డిసెంబర్ నెలలో పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. శుభ ముహూర్తాలు ఉండడంతో ఎక్కువగా శుభకార్యాలు జరగనున్నాయి.

–శనగవరపు నాగమల్లేశ్వరశర్మ, క్షీరపురి బ్రాహ్మణ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు

సీసీ రోడ్లకు శంకుస్థాపన

చినగంజాం: మండలంలోని పల్లెపాలెం, మున్నం వారిపాలెం, రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దపల్లెపాలెం రూ.17 లక్షలు, మున్నంవారిపాలెం రూ.17 లక్షలు అంచనా విలువతో గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసమూర్తి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ పీఆర్ కే నాగేంద్రబాబు, ఉపాధి హామీ ఏపీఓ మహాలక్ష్మి, కార్యాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

22 నుంచి గ్రామసభలు

మేదరమెట్ల: ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ రెండో తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శుక్రవారం సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 22న పీ.గుడిపాడు, 24న ప్రాంసగులపాడు, 26న రాచపూడి, 29న సోమవర్పాడు, నవంబర్ 1వ తేదీన అనమనమూరు, 2వ తేదీన కొరిశపాడు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించనున్నట్లు, ఈ సభలను ఆయా గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

మంజులాదేవికి డాక్టరేట్ ప్రదానం

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న చీరాలకు చెందిన గారపాటి మంజులాదేవి డాక్టరేట్ అందుకున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా ప్రకాశం జిల్లాలోని మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధిపై ప్రొఫెసర్ ఏ. భారతీదేవి ఆధ్వర్యంలో అధ్యయనం చేసినందుకుగాను డాక్టరేట్ అందించినట్లు మంజులాదేవి తెలిపారు. యూనివర్సిటీ ద్వారా సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీలో ఎకనామిక్స్ విభాగంలో డాక్టరేట్ పొందిన సందర్భంగా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజుతో పాటు కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు డాక్టర్ మంజులాదేవిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



డాక్టరేట్ అందుకుంటున్న మంజులాదేవి

సర్పంచ్, ఉపసర్పంచ్‌లు లేకుండానే పల్లెపండుగ

మేదరమెట్ల: ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లెపండుగ కార్యక్రమాల్లో అధికారులు, కూటమి నాయకులు ఇష్టారీతిన నిర్వహిస్తున్నారు. కొరిశపాడు మండలంలో నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమం శుక్రవారం మేదరమెట్ల లో జరిగింది. కార్యక్రమానికి సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఉపసర్పంచ్ మన్నె దుర్గారావు లేకుండానే కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. గ్రామానికి రూ.1.10 కోట్ల విలువగల పనులను నాయకుల చేతుల మీద పంచాయతీ అధికారులు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అక్కడకు వచ్చిన జనం అధికారులకు ఇదేం పని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పర్చూరు (చినగంజాం): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పల్లెపండుగ కార్యక్రమం ద్వారా సీసీ రోడ్లు నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. మండలంలోని పర్చూరు, ఉప్పుటూరు, బోడవాడ, కొల్లావారిపాలెం, తూర్పు పెద్దివారిపాలెం గ్రామ పంచాయతీలసందు శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఏఈ శ్రీనివాసరావు, ఏపీఓ బుచ్చిబాబు, ఈఓపీఆర్డీ కే సత్యనారాయణ, పంచాయతీ సర్పంచ్ మల్లా అంజమ్మ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



మేదరమెట్లలో పల్లె పండుగలో పాల్గొన్న నాయకులు, అధికారులు